www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 6 ఏప్రిల్ 2025

5

తిరుపతి



తిరుమల చేరుకున్న సుప్రీంకోర్టు సిజే సంజీవ్ ఖన్నా

ప్రజాశక్తి -తిరుమల

తిరుచానూరులో..

శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్న సుప్రీం చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాకు టిటిడి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొదట తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ఆయన రాత్రి 8గంటలకు నేరుగా తిరుమలకు చేరుకున్నారు. ఆయనకు టిటిడి ఈఓ శ్యామల రావు స్వాగతం పలికి బస ఏర్పాట్లను చేశారు. అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి, ఇంచార్జ్ సి.వి.ఎస్.ఓ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

సిపిఎం 24వ జాతీయ మహాసభలకు...

మధురై తరలిన జిల్లా శ్రేణులు..!

70 ఏళ్ల వయస్సులో.. 20 ఏళ్ల ఉత్సాహం...

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మధురైలో జరుగుతున్న సిపిఎం 24వ జాతీయ మహాసభ చివరిరోజు ఆదివారం జరగనున్న బహిరంగసభకు తిరుపతి జిల్లా నలుమూలల నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు నుంచి వాహనాల్లో బయల్దేరారు. తిరుపతి నుంచి గురువారం కొంతమంది బయల్దేరి వెళ్లగా, శనివారం మరికొంతమంది బయల్దేరారు. శనివారం వెళుతున్న శ్రేణుల వాహనానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి జెండా ఊపి ప్రారంభించారు. ఎస్.జయచంద్ర, డాక్టర్ పి.సాయిలక్ష్మి, పి.హేమలత, ఎం.నరేంద్ర, అజయ్‌కుమార్ తదితరులు బయల్దేరి వెళ్లారు.

ఈ సందర్భంగా వందవాసి నాగరాజు, కందారపు మురళి మాట్లాడుతూ దేశంలో సిపిఎం మహాసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నాయన్నారు. ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం దేశాన్ని పట్టి పీడిస్తున్నాయన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మనుష్యుల మధ్య విబేధాలు సృష్టించి దేశాన్ని మత ప్రాతిపదికన విభజించాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. కార్పొరేట్ శక్తులతో మమేకమై దేశాన్ని దోచుకుంటూ, సామాన్యులపై భారాలు మోపుతున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జాతీయ మహాసభలు మధురైలో బుధవారం ప్రారంభమై ఆదివారంతో ముగియనున్నాయన్నారు. చివరిరోజు జరగనున్న బహిరంగసభకు తిరుపతి జిల్లా నుంచి వంద మంది పైగా బయల్దేరి వెళ్లారని చెప్పారు.

రెడ్‌సెల్యూట్... సీనియర్ కామ్రేడ్స్

సిపిఎం 24వ జాతీయ మహాసభల నేపథ్యంలో తిరుపతి జిల్లాకు చెందిన సీనియర్ కామ్రేడ్లు చల్లా వెంకటయ్య (73), కుప్పస్వామి (54)లు మత సామరస్య సంఘీభావ సైకిల్ యాత్రను సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు జెండా ఊపి వారం రోజుల క్రితం ప్రారంభించారు. చిత్తూరు జిల్లా, తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు, తిరువణ్ణామలై, తిరుచ్చి, సేలం, ఈరోడ్ జిల్లాల మీదుగా మధురైకి చేరుకున్నారు. శనివారం సాయంత్రం మధురై చేరుకున్న సైకిల్‌యాత్ర బృందాన్ని కేంద్ర కమిటి సభ్యులు వసుకి, ఎపి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, ఎపి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, నాయకులు వి.ఉమామహేశ్వరరావు అభినందించారు. కండువా కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్రకు నాయకత్వం వహించిన సిపిఎం నాయకులు చల్లా వెంకటయ్య 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ తాము చేపట్టిన మతసామరస్య యాత్రకు తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు, తమిళనాడు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఘనంగా నీరాజనాలు పలకడంతో మరింత ఉత్సాహం కలిగిందని, మండుటెండలోనూ అలసట తెలియలేదని చెప్పారు.

మధురై బయల్దేరిన నాయకులను అభినందిస్తూ జెండా ఊపి ప్రారంభిస్తున్న వి.నాగరాజు, కందారపు మురళి

మధురైలో అభినందించిన రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సభలో ప్రసంగిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ , మాజీ మంత్రి పరసారత్నం

అజాత శత్రువు బాబూ జగ్జీవన్‌రామ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

భారతదేశ మాజీ ఉప ప్రధాని, సమతావాది బాబూజగ్జీవన్‌రామ్ జీవితం చిరస్మరణీయం అని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శనివారం ఉదయం 118వ జయంతి సందర్భంగా తిరుపతి బైరాగిపట్టెడలోని సాంఘిక సంక్షేమ శాఖ తరపున జగ్జీవన్‌రామ్ పార్కులోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, మాజీ మంత్రి పరసారత్నం, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, సాంఘిక సంక్షేమ సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, డిఎంహెచ్ఒ బాలాజీనాయక్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తుడా కార్యాలయంలోనూ తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించారు. ఇంచార్జి సెక్రెటరీ కష్ణా రెడ్డి, పి.ఓ. దేవికుమారి, ఈ.ఈ. రవీంద్ర, ఉద్యానవన శాఖాధికారి మాలతి పాల్గొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో జరిగింది. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు. మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాంప్రసాద్, బద్వేల్ ఎస్‌బివిఆర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో ఆనందరాజు, ఎస్‌సి సెల్ లైజన్ ఆఫీసర్ దేవేంద్ర బాబు పాల్గొన్నారు. (వార్తలు 6లో...)

ప్లానింగ్ సెక్రటరీలకు ప్రమోషన్ కల్పించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులరైజేషన్ సెక్రటరీలకు సీనియారిటీ లిస్ట్ రూపొందించి ఉద్యోగోన్నతి కల్పించాలని టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జె విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులును రాష్ట్ర వార్డు ప్లానింగ్ రెగ్యులరైజేషన్ సెక్రటరీల అసోసియేషన్ నాయకులు కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో డిటిసిపిని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పూర్ణచంద్రసాయి, కోఆర్డినేటర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రమోషన్ కల్పించాలని, ట్రెసర్ పే స్కేల్ వర్తింపజేయాలని, సాంకేతిక బాధ్యతలకు పరిమితం చేయాలని, ఉద్యోగుల్లో ఉన్న అపోహలను నివృత్తి చేసి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో కార్పొరేషన్ అధ్యక్షులు చల్లా గణేష్ కుమార్, లక్ష్మి ప్రియ, వెంకటేశ్వర్లు, ప్రేమచంద్, గోపీకష్ణ, కవిత, యుగంధర్, అనిల్, హైదర్ అలీ తదితరులు ఉన్నారు.

వినాయకనగర్ సిసి రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట పంచాయతీ వినాయక నగర్ 'తురాబ్ వీధి' సుమారు 80 అడుగులు వరకు రోడ్డు పగిలిపోయి స్థానిక ప్రజలకు, ట్యూషన్ విద్యార్థులకు ప్రమాదకరంగా ఉందని ఇటీవల సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర దృష్టికి రాగా, స్థానికులనుంచి సంతకాలను సేకరించి పంచాయతీ కార్యదర్శి మణి, సర్పంచి నగేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వెంటనే వారు స్పందించి శనివారం సిసి రోడ్డు మరమ్మతులను చేపట్టడంతో సిపిఎం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. దగ్గరుండి మరమ్మతులు చేయించిన వారిలో సర్పంచి నగేష్, ఉప సర్పంచి ఇర్ఫాన్, సిపిఎం రేణిగుంట కార్యదర్శి ఈశ్వరమ్మ, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్, తులసిరాజన్ పాల్గొన్నారు.

ఓటేరు దాహార్తి సమస్యకు పరిష్కారం

తిరుపతి సిటి : తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీలో నెలకొన్న తాగు నీటి సమస్య పరిష్కారం అయింది. నిరుపయోగంగా ఉన్న బోరును బాగు చేసి గ్రామానికి నీటి సరఫరా పునరుద్ధరణ చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామంలో నెలకొన్న నీటి సమస్యకు పరిష్కారం చూపారు. సుమారు ఐదు లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయించి గ్రామంలో నీటి సమస్యకు స్వస్తి చెప్పారు. నూతనంగా బిగించిన మోటార్ పంపుకు శనివారం పూజలు చేసి, నీటిని గ్రామంలోకి సరఫరా చేశారు. ఇస్మాయిల్, సూర్యకిరణ్, మోహన్, రంగయ్య, లోకేష్ పాల్గొన్నారు.

ప్రతి భక్తునికీ సీతారాముల కల్యాణ తలంబ్రాలు : జేఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఒంటిమిట్ట ఏకశిలానగరంలో ఏప్రిల్ 11న జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి భక్తుడికి ముత్యపు తలంబ్రాలు, అన్నప్రసాదాలు అందించేలా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం తెలిపారు. ఒంటిమిట్టలోని టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో శనివారం సమీక్ష, సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ టిటిడి ఈవో జె శ్యామల రావు ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో అధికారులు పటిష్ట ప్రణాళికలు ఏర్పాటు చేసుకుని అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 120 గ్యాలరీలలో ఉండే భక్తులతో పాటు, కల్యాణం వీక్షించేందుకు వచ్చిన భక్తులందరూ శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణ వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాలు పంపిణీ కోసం 16 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటిసారి కళాకతులుతో సంక్షిప్త రామాయణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు, కల్యాణ వేదిక, ఆలయం, పరిసర ప్రాంతాల్లో 12 టన్నుల సాంప్రదాయ పుష్పాలు, లక్ష కట్ ఫ్లవర్స్ తో పుష్పాలంకరణ చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో జాన్ ఎర్విన్, టిటిడి సిఇ టివి సత్యనారాయణ, ఎస్ఇ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, అన్నప్రసాదం ప్రత్యేక అధికారి కెఎల్ఎన్ శాస్త్రి, రవాణా శాఖ జీఎం శేషారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు పెంచినట్లు వైసిపి నిరూపించాలి : ఆరణి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

విద్యుత్ చార్జీలను ప్రభుత్వం పెంచినట్లు వైసిపి నిరూపించాలని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు సవాల్ విసిరారు. శనివారం ఉదయం విలేకరుల సమావేశంలో ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు 2025-26లో విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదని ఎపిఇఆర్‌సిలో ఫిబ్రవరిలోనే ప్రకటించిందని గుర్తు చేశారు. అయితే వైసిపి నాయకుడు అభినయ్‌రెడ్డి విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వం పెంచిందని అసత్య ప్రచారం చేయడాన్ని విమర్శించారు. వినాయకసాగర్‌లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ మాస్క్‌లతో నాటకం వేయడం అప్రజాస్వామికమన్నారు. వచ్చే నెల నుంచి ప్రజలకు ట్రూఅప్ ఛార్జీల భారం తప్పనున్నట్లు చెప్పారు. టిడిఆర్ బాండ్ల స్కాంలో ఉన్న ఏ ఒక్కరినీ ప్రభుత్వం విడిచిపెట్టదన్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లలో భూమి కోల్పోయిన అర్హులందరికీ టిడిఆర్ బాండ్లు ఇప్పిస్తామని స్పష్టం చేశారు. ఎన్డీఏ నాయకులు మహేష్‌యాదవ్, రాజారెడ్డి, రాజేష్‌యాదవ్ పాల్గొన్నారు.

'ఆదిశంకర'లో అంబరాన్నంటిన సిల్వర్ జూబ్లీ సంబరాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

సాధారణ ఇంజినీరింగ్ కళాశాల స్థాయి నుండి డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల ఎదగడం వెనుక ఆ కళాశాల ఛైర్మన్ వంకీ పెంచలయ్య శ్రమ ప్రశంసనీయమని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారధి అన్నారు. ఆదిశంకర కళాశాలలో ఆ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ వేలమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తున్న ఆదిశంకర కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ స్థాయి విద్యార్థులు దేశాభివద్ధికి దోహదపడే ఇంజనీర్లుగా ఎదగాలనే మంచి లక్ష్యంతో ఈ ప్రాంతంలో కళాశాలను ఏర్పాటు చేసి పాతికేళ్లుగా విద్యా రంగంలో విశేష సేవలందిస్తున్న వంకీ పెంచలయ్య అందరికీ ఆదర్శనీయులని కొనియాడారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదివి ఉన్నతంగా ఎదిగాలని, తల్లిదండ్రులు, అధ్యాపకులు, దేశం గర్వించే స్థాయి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఆదిశంకర విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ వంకీ పెంచలయ్య మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ వేడుకలకు విచ్చేసిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలకు కతజ్ఞతలు తెలిపారు. ఎన్నో వ్యవప్రయాసాలకోర్చి 25 ఏళ్ల క్రితం ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించామన్నారు. పాతికేళ్లుగా లక్షల మంది ఆదిశంకరలో విద్యనభ్యసించి దేశ, విదేశాలలో ఉన్నత స్థానాలకు ఎదగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థికి ప్లేస్ మెంట్ కల్పించాలనే లక్ష్యంతో కషి చేస్తూ సఫలీకతులమయ్యామన్నారు. కళాశాల అభ్యున్నతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహద పడుతున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరున కతజ్ఞతలు తెలిపారు. అనంతరం చేపట్టిన సాంస్కతిక కార్యక్రమాలు, జబర్ దస్త్ టీం కామెడీ షో, విద్యార్థుల డ్యాన్సులు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాత్రి పది గంటలకు ప్రారంభమైన సాంస్కతిక కార్యక్రమాలు తెల్లవారు జాము వరకూ కొనసాగాయి. ఈ కార్యక్రమంలో దేశ విదేశాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, రాష్ట్ర మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, కొల్లు రవీంద్ర, డాక్టర్ పాశిం సునీల్ కుమార్, ఐశ్వర్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్ పర్సన్, ఆది శంకర విద్యా సంస్థల వైస్.ఛైర్మన్ వంకీ అనూష, వంకీ అరవింద, వంకీ ఐశ్వర్య, డైరెక్టర్, ప్రిన్సిపల్ డాక్టర్ రాజా మురుగదాస్, ఏఓ జె. రామయ్య పాల్గొన్నారు.

వేడుకగా 'స్ప్రింగ్డేల్' వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి (మంగళం)

కరకంబాడి రోడ్డులోని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ పాఠశాల 17వ వార్షికోత్సవాలు కచ్చపి కళామందిరంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. చిట్టి పొట్టి చిన్నారుల చిట్టి చిట్టి డాన్సులు విశేషంగా ప్రతి ఒక్కరిని ఆకర్షించాయి... సాంస్కతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రతి ఒక్క అంశం ఒక ప్రత్యేకతను చాటుకుంది. తండ్రికి పిల్లల పట్ల ఉన్న బాధ్యతను వారిలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంచాలన్న విషయాన్ని బోధిస్తున్నట్టుగా, అలాగే పిల్లల పట్ల అమ్మ చూపే ఆప్యాయత, అనురాగం తో పాటు చిన్నారి వ్యోమగాములుగా అంతరిక్ష యాత్ర చేశారు. చదువుల తల్లి సరస్వతీ దేవిని వారి నత్య రీతుల ద్వారా ప్రత్యక్షం చేశారు. భారతీయత కుటుంబ నేపథ్యాన్ని కలిగినదని చెప్తూ అవ్వ తాతల పట్ల ఎలా మెలగాలో చూపించారు. అలాగే దేశభక్తిని నర నరాల్లో నింపుకున్న వీరోచిత పాత్రలను పోషించారు. రామ భక్త హనుమాన్ పాటతో రాముని పట్ల హనుమంతుడు చూపించే భక్తిని ప్రదర్శిస్తూ శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. ముఖ్యంగా మరాఠా వీరుడు మొగల సామ్రాజ్యాన్ని వనికించిన ధీరుడు వీర మరాఠా శంభాజీ మహారాజ్ నేపథ్యంలో చేసిన నృత్య విన్యాసం ప్రేక్షకులందరినీ కట్టిపడేసింది... అంతేకాకుండా మాన్యశ్రీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత్ భారతం శీర్షికన భారతదేశం ప్రస్తుత కాలంలో ఎలాంటి లక్ష్యాలను సాధిస్తున్నదో కళ్ళకు కట్టినట్టు చూపించారు. ముఖ్యంగా సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ఎలా ఎదుర్కొని ముందడుగు వేయాలో మనల్ని మనం ఎలా నిరూపించుకోవాలో తెలియజేస్తూ ముందడుగు వేయి వదిలిపెట్టద్దు అన్న శీర్షికన చేసిన నత్యం అందరిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా ఉంది. అంతేకాకుండా గత మూడు సంవత్సరాల ఎస్ ఎస్ సి లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు.. అలాగే స్ప్రింగ్ డేల్ పాఠశాలలో చదివి వారి జీవితంలో అత్యున్నత స్థాయిలో, రంగంలో తమను తాము నిరూపించుకుంటున్న విద్యార్థులను ఆహ్వానించి సముచితరీతిన సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత కేఎస్ వాసు మాట్లాడుతూ విద్యార్థులలో సాంస్కతిక అంశాల పట్ల ఆసక్తిని కనబరిచేలా ప్రోత్సహించడం తమ పాఠశాల ప్రత్యేకత అని తెలియజేశారు. ప్రధానంగా పాఠశాల పూర్వ విద్యార్థులు ఉన్నతమైన స్థాయికి ఎదగడం పాఠశాలకు గర్వకారణమని, వారిని ఆహ్వానించి సన్మానించడం చాలా సంతోషదాయకమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.ఆర్ అనురాధ గోపాల్ ,ఏవో చంద్రశేఖర్, పీఆర్వో సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా 'శ్రీ చైతన్య' జోనల్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

శ్రీ చైతన్య విద్యాసంస్థల జోనల్ స్పోర్ట్స్ మీట్ శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తుమ్మల గుంట క్రీడా మైదానంలో డాక్టర్ బి.ఎస్.రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ వి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, ఎస్పీ ఎం ఆర్ చైర్ పర్సన్ డాక్టర్ సరహా సరోజినీ, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సుబ్బిరామిరెడ్డి విచ్చేశారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ ఒత్తిడితో కూరుకుపోయిన విద్యా విధానంలో శనివారం జరిగిన శ్రీ చైతన్య క్రీడా కార్యక్రమంలో 1500 మంది విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొనడం మంచి తరుణమన్నారు.

అదేవిధంగా తిరుపతి జోన్ ఏజీఎం సురేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ముమ్ముందు ఉన్నతమైన స్థానానికి తీసుకువెళ్తామని అందరి సమక్షంలో పిల్లలందరికీ అభినందనలు తెలియజేస్తూ,ఇదే స్ఫూర్తితో ప్రతి సంవత్సరం డాక్టర్ బిఎస్ రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ కొనసాగిస్తామని, ఇంతకు పదింతలు గొప్పగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, శ్రీ చైతన్య అన్ని బ్రాంచీల ప్రిన్సిపాల్స్, ఇన్చార్జిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రియల్' ఎస్టేట్‌లోకి 'వెంకన్న'



ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

భగవంతుడు అందుకలడు... ఇందుకలడు... ఎందైనాకలడు.. ఇది భక్త ప్రహ్లాద చెప్పిన మాట. టిటిడికి ఆ రంగం...ఈ రంగం అనేమి లేదు 'లాభం' అనుకుంటే అన్ని రంగాల్లో ప్రవేశిస్తుందని యాజమాన్యం ఇటీవల చేసిన ప్రకటన ద్వారా నిరూపించింది. అందుకే కాబోలు సాక్షాత్తు ముఖ్యమంత్రే టిటిడిని రియల్‌ఎస్టేట్ రంగానికి సహకరించమని ఆదేశించడం, అందుకు యాజమాన్యం సై అనడం చకచకా జరిగిపోయాయి. ఈ విషయమై పెద్దస్థాయిలో విమర్శలు వస్తుండటం గమనార్హం. తిరుపతి అభివృద్ధికి నిధులు కేటాయిస్తే 'నై' అన్న బిజెపి నేతలు, రియల్‌ఎస్టేట్‌కు సహకరించాలని స్వయానా సిఎం చెప్పినా నోరు మెదపకపోవడం గమనార్హం.

టిటిడి ఆర్థికంగా పరిపుష్టిగల ఓ ధార్మిక సంస్థ. అదో మిని ప్రభుత్వంలా చెలామణి అవుతోంది. నిత్యం భక్తులు ముడుపుల ద్వారా అందిస్తున్న డబ్బులతో ప్రతిరోజూ కోట్లాది రూపాయల ఆదాయంతో నడుస్తున్న రంగం. పలు చోట్ల శ్రీవారి కల్యాణాలు జరిపించడం, వెంకటేశ్వర స్వామి ఆలయాలను నిర్మించడం వంటి కార్యక్రమలు జరుగుతుంటాయి. ఆలయాలు నిర్మాణం అనేది సుదూర ప్రాంతాల వారిని వెంకటేశ్వరస్వామికి దగ్గర చేయడం, ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు చేపట్టే కార్యక్రమం. మారుమూల ప్రాంతాలు, పల్లెలు, ఏజెన్సీ ప్రాంతాలు, పెద్ద పెద్ద నగరాలు, విదేశాల్లో సైతం శ్రీవారి ఆలయ నిర్మాణాలకు సహకరిస్తుంటారు. ఈ నేపథ్యంలో అనేక సార్లు వివాదాస్పద నిర్ణయాలు సైతం జరుగుతూనే ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ వెళ్లడం యాజమాన్యం పని. కానీ పాలకుల మెప్పుకోసం, రాజకీయ నాయకుల మెహర్బాణి కోసం తీసుకునే నిర్ణయాలు అనేక సార్లు వివాదాస్పద మవుతున్నాయి. అలాంటిదే ఇటీవల రియల్‌ఎస్టేట్ సంస్థల వెంచర్లలో నిర్మించిన ఆలయాల బాధ్యత టిటిడి తీసుకోవాలని నిర్ణయించడం. దీనికి సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రే స్వయంగా ఆదేశాలు ఇవ్వడం శోచనీయం. రియల్ ఎస్టేట్ సంస్థ అనేవి. వారి వారి వ్యాపారాలు వృద్ధి చేసుకునేందుకు రకరకాల పద్ధతులు అవలంబిస్తుంటాయి. తమ వెంచర్ల వద్ద పార్కులు, ఆలయాలు, యోగా కేంద్రాలు, మినిథియేటర్లు, ఆధునిక వసతులతో కూడిన సౌకర్యాలు కల్పిస్తుంటారు. ఇవ్వన్నీ కోట్లు అర్జించేందుకు వారు వేసే ఎత్తుగడలు. అలాంటి రియల్‌ఎస్టేట్ వెంచర్లలో నిర్మించిన టిటిడి ఆలయాల నిర్వహణ బాధ్యత టిటిడి తీసుకోవాలని నిర్ణయించడం శోచనీయం.చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న జి స్క్వేర్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ తాను వెంచర్లు చేపట్టిన చోట టీటీడీ ఆలయాన్ని సొంత ఖర్చులతో నిర్మిస్తున్నందున దాని నిర్వహణ బాధ్యతను టీటీడీ తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించడం అసమంజసమైనది. ఈ రకమైన ధోరణితో పోతే దేశంలో అనేక వివాదాలకు కేంద్రంగా టిటిడి మారుతుంది. వ్యాపార అవసరాల కోసం వ్యక్తులు చేసే ఆలయాల నిర్మాణానికి టీటీడీ బాధ్యత వహించాల్సిన అవసరం లేదు. ఇప్పటికే దేశవ్యాప్తంగా కళ్యాణ మండపాలు నిర్మించి వాటి నిర్వహణ చేయలేక టీటీడీ చేతులెత్తేసిన విషయాన్ని ఓసారి టిటిడి గుర్తు చేసుకోవాల్సి ఉంది. ముఖ్యమంత్రి ఆగమేఘాల మీద టిటిడితో రాష్ట్ర రాజధానిలో సమీక్ష పెడితే టిటిడిని మరింత బలోపేతం చేస్తారని, కార్మికులకు మంచి జరుగుతుందని అందరూ భావించారు. కానీ రియల్ ఎస్టేట్ సంస్థల జేబులు నింపేందుకు టిటిడిని సహకరించాలని ఆదేశిస్తారని ఎవ్వరూ ఊహించలేదు. నిత్యం వేలాది మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు శ్రీవారి భక్తులకు సౌకర్యాల కల్పనకు శ్రమిస్తూనే ఉన్నారు. వారికి సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోర్టులు ఆదేశించిన అమలు చేయకపోవడం విడ్డూరం. ఇప్పటికైన వివాదస్పద నిర్ణయాలు మానుకుని, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు, అహర్నిశలు శ్రమించే కార్మికులకు, ఉద్యోగులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని మేధావులు, వామపక్షాలు, సంఘసేవకులు కోరుతున్నారు.

పెచ్చులూడుతున్న పైకప్పులు

శిథిలావస్థకి చేరుతున్న మండల పరిషత్ దుకాణాల సముదాయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణ స్థానిక నడిబొడ్డులోని మెయిన్ స్కూల్ కాంప్లెక్స్‌లో, మండల పరిషత్ ఆధ్వర్యంలో ఉన్న వ్యాపార సముదాయల దుకాణాల పై కప్పు పెచ్చులూడి శిథిలావస్థకు చేరుతున్నా అధికారులు దృష్టి సారించడం లేదు. సమస్యను విన్నవించుకున్నా ఫలితం లేదు. వ్యాపారాలను కొనసాగించాలంటే ఏ క్షణాన ఏం జరుగుతుందోనని వ్యాపారస్తులు ఆదోళన చెందుతున్నారు. వర్షం వచ్చిందంటే కప్పు ఉరిసి సామగ్రి అంతా చెడిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దుకాణాలు రోడ్డు మట్టానికన్నా లోతట్టులో ఉన్నందున రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు దుకాణాలలో చేరడంతో వారికి తీవ్ర నష్టం వాటిల్లింది. షాపుల పైకప్పు పెచ్చులూడి పడడంతో కొంతమందికి గాయాలయ్యాయి.గతంలో ఎంపీడీవో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని వ్యాపారస్తులు తెలిపారు. ఈ విషయంపై తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, దుకాణదారులకు న్యాయం చేయాలని వ్యాపారస్తులు కోరుతున్నారు. ఎంపీడీవో రమేష్ బాబును వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే సంబంధిత ఏఈని పంపి చర్య తీసుకుంటామని తెలిపారు.

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

- వడమాలపేటలో నిరంతరం అందుబాటులో మద్యం
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలశాయి. మద్యం ఇప్పుడు అప్పుడు అని సమయం లేకుండా ఎల్లపుడూ అందుబాటులో ఉంటోంది. ప్రభుత్వ అనుమతితో నడిచే వైన్ షాపులు మాత్రం నిర్ణీతసమయంలో కొనసాగుతాయి. ఇక తర్వాత మొదలౌతుంది బెల్ట్ వ్యాపారం. గ్రామాల్లో పలు బెల్ట్ షాపుల్లో ఏ మధ్య రాత్రి తలుపు తట్టినా మద్యం లభిస్తుంది. అంతేకాక బెల్ట్ షపు నిర్వహుకులు డోర్ డెలివరీ సదుపాయం కూడా చేపడుతున్నట్లు సమాచారం. కొన్ని కిరాణా షాపుల్లో కూడా మద్యం లభిస్తుండటం విశేషం. అధిక ధరకైనా ఎల్లపుడూ మందు దొరుకుతుండటంతో మందుబాబులు కిక్కు దిగకుండా జాగ్రత్త పడుతున్నారు. మద్యం మత్తులో సంసారాలు నాశనమవుతున్నాయని మహిళలు వాపోతున్నారు. మండలంలో అధికారుల కనుసన్నల్లోనే ఈ బెల్టు వ్యాపారం జరుగుతోందని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు బెల్టు షాపులపై దృష్టి సారించి కట్టడి చేయాలని కోరుతున్నారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్ గణేష్‌కు సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు టీడీపీ నాయకులు డి.ఎస్. గణేష్ పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమయిన సందర్భంగా ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నాయకులు ఆయనను సన్మానించారు. ఈకార్యక్రమంలో నగరి నియోజక వర్గం టిడిపి మైనారిటీ సెల్‌అధ్యక్షులు, రఫీ అహ్మద్ గెట్ పుత్తూరు మసీదు మస్జిద్ ఏ ముఖద్దస్ ముతవల్లి మహమ్మద్ గౌస్ చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కే. షబ్దర్, హమీద్ భాష నగరి నియోజకవర్గం టిడిపి తెలుగు యువత ఆర్గనైజ్ సెక్రెటరీ యూనిస్ పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గణేష్‌ను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి ధనపాల్, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ కరుణాకరన్, పుత్తూరు మున్సిపాలిటీ 10 వ వార్డు ఇంన్చార్జ్ ధనపాల్, బాబునాయుడు, అన్బలగన్, కైలాసం, బాలాజీ, బాలకృష్ణ, అశోక్, గోవిందస్వామి పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ నెల 15వ తారీఖున స్థానిక ఎస్ఎస్ కళ్యాణ మండపంలో జరిగే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.15 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలకు హాజరవుతారని తెలిపారు.

అనుపల్లె - పనపాకం రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడు..?

- 4 కిలోమీటర్లు రోడ్డుకు అటవీ శాఖ అడ్డంకులు
- అంతర్ మండలాలకు అనువైన రోడ్డు మార్గం
- అనుమతివ్వాలని అటవీ శాఖకు స్థానికుల వినతి
- జాతీయ రహదారికి అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం : తిరుపతి జిల్లా, రామచంద్రపురం మండలం, అనుపల్లె నుండి పనపాకం వరకు రోడ్డు అంతర్ మండలాలకు అనువైన మార్గం. ఈ రోడ్డు నిర్మాణంకోసం చంద్రగిరి, రామచంద్రాపురం, వెదురుకుప్పం, పాకాల మండలాల ప్రజలు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. రోడ్డు రవాణా సౌకర్యాలు లేని రోజులలో శతాబ్ద కాలంగా ప్రజలు అనుపల్లె నుండి ముసల్ రెడ్డి ఇండ్లు మీదుగా కాలినడక మార్గంలో అడవి ప్రాంతం ద్వారా నడిచి పనపాకం రైల్వే స్టేషన్‌కు చేరుకునేవారు. అక్కడనుండి చిత్తూరు, దామల చెరువు, పాకాల, వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు. అనుపల్లి నుండి పనపాకం రైల్వే స్టేషన్‌కు 11 కిలోమీటర్ల దూరంలో ఉంది. బస్ సౌకర్యాలు లేని రోజులలో అటవీ ప్రాంతంలోని కాలి రోడ్డు మార్గంలో నడిచి రాకపోకలు సాగించేవారు. ఈ నేపథ్యంలో 2009వ సంవత్సరంలో గల్లా అరుణకుమారి రోడ్లు భవనాలు శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అనుపల్లె నుండి ముసల్ రెడ్డి ఇండ్ల వరకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి నుండి అరిగెల వారి పల్లి వరకు రోడ్డు నిర్మాణం చేయించారు. మధ్యలో అటవీ శాఖకు చెందిన అటవీ భూములలో 4 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం చేయడానికి అటవీ శాఖ అనుమతులు లేవని అడ్డుకున్నారు. దీంతో చంద్రగిరి మండలంలోని అరగెల వారి పల్లి, పాకాల, ఐరాల, పులిచెర్ల మండలాల నుండి అనుపల్లె పరిసర ప్రాంతాలలో బంధువుల ఇళ్లకు వచ్చేందుకు కాలిమార్గం ద్వారానే నడిచి వచ్చేవారు. జాతీయ రహదారులు, బస్సు రవాణా సౌకర్యాలు మెరుగు పడటంతో చంద్రగిరికి వచ్చి అక్కడనుండి అనుపల్లికి చేరుకునేవారు. దీంతో 35 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తున్నది. అటవీ ప్రాంతంలో ఎలాగైనా రోడ్డు నిర్మాణం చేపట్టాలని అప్పటి మంత్రి గల్లా అరుణకుమారి, ఎంపీ ఎన్.శివ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో అనుపల్లె పంచాయతీ సర్పంచ్ యారం సుబ్రహ్మణ్యం గ్రామస్తుల సహకారంతో రాత్రికి రాత్రే ట్రాక్టర్లు జెసిబిలతో తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆ తాత్కాలిక రోడ్డులో వాహనాల రాకపోకలు కొంతకాలం సాగించారు. అటవీ శాఖ అధికారులు అటవీ శాఖ భూముల సరిహద్దులలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. బెంగుళూరు, వేలూరు సీఎంసి, కాణిపాకం పనపాకం, పాకాల, ఉమ్మడి జిల్లా కేంద్రమైన చిత్తూరుకు వెళ్లేందుకు చంద్రగిరికి వెళ్లి అక్కడనుండి బస్సుల్లో వెళ్లాల్సి వస్తున్నది. అనుపల్లె, పనపాకం రోడ్డు మధ్యలో నాలుగు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి పాలకులు, జిల్లా ఉన్నతాధికారులు అటవీ శాఖ అనుమతులు ఇప్పించి రోడ్డు నిర్మాణం చేపడితే 25 కిలోమీటర్లు దూరం తగ్గుతుంది. ప్రజలకు ఆ రోడ్డు చాలా అనువుగా ఉంటుందని ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. వెదురుకుప్పం, రామచంద్రాపురం, వడమాలపేట, చంద్రగిరి మండలంలోని గంగుడు పల్లి, ప్రాంతాలలో పాడి రైతులు సేకరించిన పాలను వివిధ పాలఫ్యాక్టరీలకు తరలించేందుకు చంద్రగిరికి వెళ్లి అక్కడనుండి హెరిటేజ్ పాల ఫ్యాక్టరీకి, దొడ్ల పాల ఫ్యాక్టరీ, బాలాజీ డైరీలకు తరలించాల్సి వస్తున్నది. అదే అనుపల్లె - పనపాకం రోడ్డు నిర్మాణం జరిగితే పాడి రైతులకు కూడా దూరం తగ్గుతుంది. రవాణా చార్జీలు కూడా తగ్గుతాయి. తద్వారా పాడిరైతులకు ఆదాయం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అనుపల్లె రోడ్డును పనపాకం మీదుగా వెళుతున్న జాతీయ రహదారిపై అనుసంధానం చేయడం వల్ల ఈ రోడ్డు మార్గం ద్వారా కార్లు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు కొనసాగించడం ద్వారా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకల రద్దీ కూడా తగ్గుతుంది. మామిడి రైతుల కూడా మామిడి పంటను దిగుబడి చేసి దామలచెరువు మ్యాంగో మార్కెట్‌కు తరలించేందుకు దూరం తగ్గి అనువుగా ఉంటుంది. ఈ రోడ్డు నిర్మాణంపై చంద్రగిరి ఎమ్మెల్యే నాని దృష్టి పెట్టి, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి అటవీ శాఖ అనుమతులు ఇప్పించి, రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులు కేటాయించాలని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు.

అటవీ శాఖ అనుమతులు లేక ఆగిపోయిన రోడ్డు నిర్మాణం

గ్రామీణ ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందుతాయి

అనుపల్లె... పనపాకం రోడ్డు నిర్మాణం జరిగితే గ్రామీణ ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందుతాయి. రైతుల భూముల విలువలు కూడా పెరుగుతాయి. అనుపల్లి పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పేందుకు వీలుంటుంది. స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి, ప్రజలు ఆర్థికంగా అభివృద్ధిని సాధిస్తారు. జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఎమ్మెల్యే పులివర్తి నానీ, ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. చంద్రగిరి, ఆర్.సి.పురం, పాకాల మండలాల ప్రజల చిరకాల వాంఛైన అనుపల్లె- పనపాకం రోడ్డు నిర్మాణ అనుమతులు మంజూరు కావాలి.

-బి.విజయ్ కుమార్ రెడ్డి, అనుపల్లె, గ్రామం పంచాయతీ,

ప్రభుత్వం అటవీ అనుమతులు ఇవ్వాలి

కూటమి ప్రభుత్వం అనుపల్లె, పనపాకం రహదారి మధ్యలో ఉన్న నాలుగు కిలోమీటర్లు అటవీ భూములకు అనుమతులు ఇచ్చి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టి పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారికి అనుసంధానం చేయాలి. ఈ రోడ్డు అంతర్ మండలాల ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

-ఆకా దేవరాజులు, టిడిపి బూత్ కమిటీ అధ్యక్షుడు, అనుపల్లె గ్రామం, రామచంద్రాపురం.

నాని చొరవతోనే రోడ్డు నిర్మాణం సాధ్యం

అభివృద్ధి ఎజెండాగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే నానితో అనుపల్లె, పనపాకం రోడ్డు నిర్మాణం సాధ్యమవుతుంది. శతాబ్దాల కాలంగా ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు అటవీ శాఖ అనుమతులు, రోడ్డు నిర్మాణానికి నరేగా నిధులు మంజూరు చేయించాలి. ఈ రోడ్డు నిర్మాణం వల్ల పాడి, మామిడి రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

- బండి లీలా ప్రకాష్ రెడ్డి, సాఫ్ట్వేర్ ఇంజనీర్, రేకుల చేను గ్రామం

తిరుపతికి ఔటర్ రింగ్ రోడ్డుగా ఉంటుంది



ఈరోడ్డు నిర్మాణం జరిగితే 25 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి రోజు రోజుకు విస్తరించి, అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ రోడ్డు నిర్మాణం జరిగితే చంద్రగిరి తిరుపతి నగరంలోకి ప్రవేశించకుండా ఔటర్ రింగ్ రోడ్డులాగా రేణిగుంట విమానాశ్రయం, శ్రీకాళహస్తి, తిరుచానూరు, నారాయణవనం, అప్పలాయగుంట దేవాలయ ప్రాంతాలకు సులభంగా వెళ్లవచ్చు. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కూడా తగ్గుతుంది.

- ఏ నవీన్ కుమార్, బిటెక్ విద్యార్థి, అనుపల్లి గ్రామం, రామచంద్రాపురం మండలం.

వేద గణితం, అబాకస్‌లు గణిత అభ్యసనానికి అత్యావశ్యకం

ప్రజాశక్తి - క్యాంపస్ : వేద గణితం, అబాకస్‌లు విద్యార్థుల గణిత అభ్యసనానికి ఎంతో అత్యావశ్యకమని ఎస్వీయూ ఇంచార్జ్ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. తిరుపతిలోని న్యూ బాలాజీ కాలనీలో స్థానిక ఆర్కే గ్రూప్ అఫ్ ఇన్స్టిట్యూషన్స్, వీక్ష ది స్కూల్, ఆర్కే అబాకస్ సంస్థల 13వ వార్షికోత్సవం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్వీయూ ఇంచార్జ్ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఆన్- ఎయిడ్ స్కూల్స్ మానేజ్మెంట్ అసోసియేషన్ (అప్పుస్మా)రాయసీమ జోనల్ ప్రసిడెంట్, విశ్వం స్కూల్స్ అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి, గీతం గ్రూప్ అఫ్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ అధినేత డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, నలంద హై స్కూల్ అధినేత ఓ. వెంకటరమణ రెడ్డి, ఎమ్. ఎమ్. బి. జి స్కూల్స్ అధినేత భాస్కర రాజు, విహెచ్పి రాష్ట్ర ఈస్యూటీ కమిటీ మెంబెర్ ఎన్.సుమతీ రెడ్డి, సారా హాస్పిటల్ అధినేత డా. రణధీర్, యస్వీ. ఐటిఐ కాలేజీ అధినేత ఓంప్రకాష్, ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.పాకనాటి హరికృష్ణ, అన్నమయ్య డాన్స్ అకాడమీ అధినేతలు డాక్టర్. శ్రీరామ్ బాబు, వినయ శ్రీ,ఆర్కే విద్యాసంస్థ అధినేత డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆర్. కె విమల, అనగాని రెడ్డప్ప,చిట్టీ, శశి యాదవ్, యూత్ శ్రీనివాస్, సిఆర్ ఎస్ రవిచంద్ర, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు పగటి డ్రామాలు ఆపండి : నరసింహ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత వైసిపి హాయంలో టిడిఆర్ బాండ్ల జారీలో జరిగిన తీరుపై నగరపాలక సంస్థ కమిషనర్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తే భూ బాధితులు తమ సమస్యలతో అధికారులు ముందు ఏ కరువు పెడుతుంటే ఇందుకు కారణమైన వారు పగటిపూట డ్రామాలు వేసుకొని ప్రజల దృష్టిని మరచాలని చూడటం అత్యంత బాధాకరమని రాష్ట్ర యాదవ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిని అభివృద్ధి చేసింది టీడీపీనే అన్నారు. వైసీపీ హయాంలో తుడ నిధుల దుర్వినియోగం జరిగాయని దుయ్యబట్టారు. కార్పొరేటర్లు కోట్లకు కోట్లు ఎలా సంపాదించారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, కట్టా జయరాం యాదవ్, హేమంత్ యాదవ్, సుబ్బు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఆర్‌టిఐ సాధన కమిటీ ఉపాధ్యక్షుడిగా సురేష్

ఎస్.ఎం.సురేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: శనివారం పిచ్చాటూరు టిడిపి పార్టీ కార్యాలయంలో నాలాపూరం మండలానికి చెందిన ఎస్.ఎం. సురేష్‌కి ఉమ్మడి జిల్లా ఆర్‌టిఐ సాధన కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎస్.ఎం. సురేష్‌ని డాక్టర్ చంటి ముదిరాజ్ నేషనల్ ప్రెసిడెంట్ ద్వారా నియమక పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సురేష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, పద్దు రాజు,వాసు రెడ్డి, మాజీ ఎంపీపీ మురళి నారాయణ రాకేష్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రోజాపై విచారణ జరుగుతోంది

రోజా అరెస్టుకు వారెంట్ చాలు దమ్మక్కర్లేదు : శాప్ చైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ మంత్రి రోజా ఆడుదాం ఆంధ్రాలో అవినీతి చేశారని, దీనిపై విచారణ కూటమి ప్రభుత్వం చేపట్టిందని త్వరలోనే ఆమెను అరెస్టు చేయడం జరుగుతుందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ రవినాయుడు స్పష్టం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో రవినాయుడు మాట్లాడారు. మాజీ మంత్రి రోజా గ్రామీణ పేద క్రీడాకారులకు సంబంధించిన రూ.119 కోట్లను దోచుకున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులు అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, హేమంత్, తోటా వాసు, గోపి, దిలీప్ రాయల్, శ్రీనివాస యాదవ్, రఫీ, లోకేష్, రూపేష్ పాల్గొన్నారు.

శ్రీనివాస మైన్‌కి అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని తుంగపాలెం సమీపంలో ఉన్న శ్రీనివాస మైనింగ్‌కు అనుమతులు ఇవ్వొద్దని మైనింగ్ భాగస్వామి తుమ్మతాటి విజయ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకి, గూడూరు డిఎస్పీకి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భాగస్వామి ఫోర్జరీ సంతకాలు సృష్టించి తనను తొలగించారన్నారు. ఇదేమని అడిగితే దిక్కున్న చోటు చెప్పుకోమని, కులం పేరుతో దూషించారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ రాఘవేంద్ర ఈడితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

క్రైం న్యూస్

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

8 దుంగలు, 2 బైకులు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి కడప ఫారెస్ట్ డివిజన్, ప్రొద్దుటూరు రేంజ్‌లో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను శనివారం అరెస్టు చేసి 8 ఎర్రచందనం దుంగలను, 2 మోటారు సైకిళ్లనును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాలతో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ పీ.నరేష్ బృందం, స్థానిక పత్తూరు ఎఫ్బీఓ లింగా నాయక్ తో కలిసి ఆ ప్రాంతంలోని తెలుగు గంగ కెనాల్ నుంచి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళుతుండగా కడప జిల్లా ఖాజీపేట మండలం, ప్రొద్దుటూరు రేంజిలోని పత్తూరు ఫారెస్టు బీటు పరిధిలోని కేసీ కెనాల్ వద్దకు చేరుకోగా ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిళ్లపై నిలబడి కనిపించారన్నారు. వారికి సమీపించడంతో, వారు టాస్క్ ఫోర్సు సిబ్బందిని చూసి మోటారు సైకిళ్లను వదిలి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వారిని వెంబడించి ఇద్దరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారన్నారు. ఆ సమీప ప్రాంతాల్లో పరిశీలించగా 8 చెక్కబడిన ఎర్రచందనం దుంగలు గుర్తించామన్నారు. పట్టుబడిన వారిని కడప జిల్లాకు చెందిన వారుగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ఆటోను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - తడ: తడ మండలం, చేనుగుంట సమీప నేషనల్ హైవే పై, క్రాసింగ్ వద్ద చెన్నై నుండి విజయవాడ వెళుతున్న జగన్ ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి, చేనుగుంట మీదుగా అండగుండాలకు వెలుతున్న ఆటోను ఢీ కొట్టడంతో ఆటో పల్టీలు కొట్టి బోల్తా పడి నుజ్జునుజ్జు అయింది. ఆటోలోఉన్న డ్రైవర్ కుమార్, మున్నూరు చిన్నాలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురిని సూళ్లూరుపేట హాస్పిటల్‌కు తరలించగా మున్నూరు చిన్నాను మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు, అక్కడ నుంచి తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ మున్నూరు చిన్న మరణించినట్లు వైద్యులు తెలిపారు. డ్రైవర్ కుమార్ పరిస్థితి కూడా విషమంగా వున్నట్లు వైద్యులు తెలిపారు. తడ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

స్టే హోంల మధ్య గ్యాంగ్ వార్..

నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని చింతలచేను వద్ద నున్న రెండు హోం స్టేల మధ్య శుక్రవారం అర్ధరాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. ఇరు వర్గాల మధ్య జరిగిన దాడిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని చింతలచేను వద్ద పక్కపక్కన ఉన్న రెండు స్టే హోమ్‌ల నిర్వహకుల మధ్య వివాదం చోటు చేసుకుంది. తమ హోమ్‌కి వస్తున్న కస్టమర్లను మరో హోం బలవంతంగా తీసుకెళ్తున్నారని అర్ధరాత్రి భక్తులు ముందు గొడవకు దిగారు. డెక్కన్ సూట్స్ హోమ్ స్టే నిర్వాహకులపై, గరుడ హోమ్ స్టే యాజమాన్యం కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో డెక్కన్ సూట్స్ హోం స్టే నిర్వాహకులు నరేష్, నవీన్, లక్ష్మీనారాయణ, ఫణిందర్ రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి.గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించారు. దాడికి పాల్పడిన 7మందిని ఈస్ట్ పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నారు.

కిడ్నాప్ కేసులో ఆరుగురు అరెస్ట్

కార్లు, సెల్ ఫోన్లు, కత్తులు, ప్లాస్టిక్ రోప్, వాటర్ ప్రూఫ్ టేప్ స్వాధీనం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : కిడ్నప్ కేసులో అరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రెండు కార్లు, ఏడు సెల్ ఫోన్లు నాలుగు కత్తులు ప్లాస్టిక్ రోప్, వాటర్ ప్రూఫ్ స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి డిఎస్పి శ్రీలత తెలిపారు. స్థానిక అలిపిరి పోలీస్ స్టేషన్లో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మార్చి 28, 29 తేదీలలో కాసరం రాజేష్ కుటుంబం కిడ్నాప్‌కు గురైన విషయం విషయం తెలిసిందే. కాసరం రాజేష్ తల్లికి 1.5 కోట్ల ధనం వస్తుందని తెలుసుకున్న తోటి స్నేహితుడు భార్గవ్, అరుణ్ కుమార్‌తో కలసి పక్కా ప్లాన్ వేశాడు. రాజేష్‌కు అనుమానం రాకుండా ఇవ్వవలసిన 24 లక్షల రూపాయలు ఇస్తానని నమ్మబలికి వారి కుటుంబాన్ని పిలిపించి కిడ్నాప్ చేశారు. కిడ్నాప్ వ్యవహారాన్ని పసిగట్టిన రాజేష్, కిడ్నాపర్ల నుండి తిరగబడి ఐతేపల్లె వద్ద తప్పించుకొని, కారు నుంచి దూకేసి 100 కాల్ చేసాడు. దింతో అప్రమత్తమైన కిడ్నాపర్లు చిత్తూరు వద్ద రాజేష్ తల్లిని వదిలిపెట్టి, కుటుంబాన్ని మరొక చోట వదిలేసి పారిపోయారు. బాధితుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని, కిడ్నాపర్లను రేణిగుంట-కడప మార్గంలో, కుక్కల దొడ్డివద్ద నిందితులు జీవకోనక చెందిన సంగీతం భార్గవ్, తిమ్మినాయుడుపాలెం పంచాయతీకి చెందిన వట్టి కుంట అరున్ కుమార్, శ్రీకాళహస్తి మండలం, జోగరాజుపల్లి గ్రమానికి చెందిన దామతోటి సాయి కుమార్, రేణిగుంట మండలం, తిమ్మయ్య గుంట గ్రామానిక చెందిన బలిపాకు మణికంఠ, ఏర్పేడు మండలం, ఇసుకతేగేలి హరిజనవాడకు చెందిన చీరాల ప్రకాష్, పెళ్లకూరు మండలం, చిల్లకూరు హరిజనవాడకు చెందిన సిరియల గణేష్‌లని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. కిడ్నాపర్ల వద్ద మత్తును కలిగించే ఇంజక్షన్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో మత్తు ఇంజక్షన్లు వినియోగించలేదన్నారు. అరుణ్ కుమార్‌పై ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో మర్డర్ కేసు, వారణాసి ఎటిఎం కేసు, రామకుప్పం, సంబేపల్లిలో కిడ్నాప్ కేసులు వున్నాయి అని వెల్లడించారు. భార్గవ్‌పై ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లోమర్డర్ కేసు, రామకుప్పం కిడ్నాప్ కేసు, సాయి కుమార్‌పై దొంగతనం, కొట్లాట కేసులు ఉన్నాయని తెలిపారు. అరెస్టు చేసిన వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో అలిపిరి సిఐ రామకిషోర్, ఎస్సై పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి గుల్షాద్ బేగం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శివ, వెంకటేష్, మండల విద్యా వనరుల శాఖ కార్యాలయ సిబ్బంది మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, టవర్ క్లాక్ సెంటర్ వద్ద బాబు జగ్జీవన్ రామ్ జయంతి కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఎమ్మెల్యే సునీల్ కుమార్‌లు హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రత్నం, శ్రీనివాసులు ,శివకుమార్ ,పులిమి శ్రీనివాసులు ,తాసిల్దార్ లు చంద్రశేఖర్, శ్రీనివాసులు ,తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి కార్యాలయం ముందు..

బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆయన జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, శివకుమార్, మాకాని వెంకటేశ్వర్లు, సిసింద్రీ, మంద రవి, శ్రీనివాసులు, పెంచలయ్య, తాసిల్దార్‌లు చంద్రశేఖర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధి కార్యాలయంలో.. జగ్జీవన్ రామ్ జయంతిని గూడూరు మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గూడూరు ఎంపిడివో మధుసూదన్ రావు జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది శరత్, అనుదీప్ , తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ట్రస్ట్ దళిత సంఘాల ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని అంబేద్కర్ ట్రస్ట్ కార్యదర్శి అపరంజి కుప్పయ్య పేర్కొన్నారు. శనివారం అంబేద్కర్ ట్రస్ట్ దళిత సంఘాలు ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం. కే విజయ్ కుమార్, రాజేందర్, ధనపాల్, షణ్ముగం, ప్రభాకర్, దళిత నాయకులు. పాల్గొన్నారు.

అంబేద్కర్ కూడలిలో.. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా కెవిపిఎస్ నాయకులు ఆర్ వెంకటేష్ నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు శివ, రమేష్, నాయుడు, భాష సతీష్ కుమార్ జై భీమ్ అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాలెం తహశీల్దారు కార్యాలయంలో..

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ రాజశేఖర్ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు మధుస్వామి, రవి రెడ్డి, వెంకటయ్య, రమణయ్య, మోహన్, సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఎస్వీయూలో..

ప్రజాశక్తి - క్యాంపస్ : బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఎస్వీయూలో ఘనంగా జరిగాయి. ఇంచార్జ్ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కామర్స్ మేనేజ్మెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య పీవీ నర్సయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వేదవిశ్వవిద్యాలయంలో.. శ్రీ వేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయంలో బాబు జగజ్జీవన్ రామ్ జన్మదినోత్సవ వేడుకలు రిజిస్ట్రార్ పి. భాస్కరుడు అధ్యక్షతన శనివారం పరిపాలన భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్.వి.ఆర్ట్స్ కాలేజ్, తెలుగు భాషా విభాగము, హెచ్.ఓ.డి ప్రొఫెసర్ ఎన్. భీమన్న హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో సంచాలకులు డా.టి. ఉమేష్ బట్, అకడమిక్ డీన్ గోళి సుబ్రమణ్యశర్మ, అధ్యాపకులకు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటగిరి, సీతారాం ఏచూరి నగర్ నందు కెవిపిఎస్ ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : సీతారాం ఏచూరి నగర్ నందు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో బాబు జగ్జీజీవన్ రామ్ 118 వ జయింతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కెవిపిఎస్ గౌరవ అధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు అర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు తుపాకుల నారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎం వి.రమణ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రాజయ్య, ఏకల లవ్య ఎరుకుల సంక్షేమ సంఘం నాయకులు చిరంజీవి, మురుగయ్య, నాగార్జున పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో.. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ ఎఫ్ ఆధ్వర్యంలో వెంకటగిరి టౌన్ త్రిభుని సెంటర్ వద్ద జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు కంటిపల్లి మనీ, యూత్ లీడర్ వెంకీ, ఐదవ వార్డు మాజీ కౌన్సిలర్ మంచి బాబు, ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ చెంగారావు, మాజీ ఏఎంసి చైర్మన్ పులుకులు రాజేశ్వరరావు, 22వ వార్డు కౌన్సిలర్, విశ్వనాథ్ మురుగ, టిడిపి మండల అధ్యక్షులు చంద్రమౌళి రెడ్డి, మండల ఎంపీపీ తనుజ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగలాపురం సిపిఎం మండల కార్యదర్శి ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - నాగలాపురం: నాగలాపురం సిపిఎం మండల కార్యదర్శి ఆధ్వర్యంలో శనివారం జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో దినమణి, దాక్షా యని, మలర్, కృష్ణవేణి, శ్రీవల్లి, చిన్నమ్మ, అలిమేలు పాల్గొన్నారు.

పాకాల మండల కెవిపిఎస్ ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - పాకాల : పాకాల, ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న ఆటో స్టాండ్ దగ్గర కెవిపిఎస్ సంఘం మండల అధ్యక్షుడు నరేంద్ర అధ్యక్షతన బాబు జగ్జీవన్ రామ్‌కు జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్ రావు హాకజరయ్యారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ సంఘ నాయకులు లక్ష్మయ్య, వెంకట్రామయ్య, శేఖర్, ఆటో సంఘ నాయకులు దేవేంద్ర, బాబు, శేఖర్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి బాబూఅగ్రహారం మునిసిపల్ హైస్కూల్..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : బాబు జగజ్జీవన్ రావు జయంతిని శనివారం స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి బాబూ అగ్రహారం మునిసిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. అయన చిత్రపటం వద్ద భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నివాళులర్పించారు.

దళిత జనోద్ధారకుడు బాబు జగ్జీవన్ రామ్: గౌడపేరు చిట్టిబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దళిత జనోద్ధారకుడు బాబు జగ్జీవన్ రామ్ అని కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా బైరాగిపట్టెడ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాంగాటి గోపాల్ రెడ్డి, చిత్తూరు శివశంకర్, తమటం వెంకట నరసింహులు, మల్లికార్జున, గోపి, చంగ్రాయులు, వెంకటరామయ్య, నరేంద్రబాబులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ అవిరళ కృషి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : సమాజాభివృద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ ఎనలేని కృషి చేశారని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు పేర్కొన్నారు. ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు (ఎఫ్ఎసి) వై. లక్ష్మీ సరసయ్య, పి. ఆయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణాదేవి, వరకుమార్, జానకిరామ్, జనరల్ మేనేజర్లు ఎం. కృష్ణా రెడ్డి, రామచంద్ర రావు, మురళి, ఎస్ఇ/సివిల్(ఇన్చార్జ్) తిరుమల రావు పాల్గొన్నారు.

తిరుపతి, బైరాగిపట్టెడలో.. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా తిరుపతి, బైరాగిపట్టెడలోని బాబు జగజ్జీవన్ రామ్ పార్కులో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే.రాధాకృష్ణ, నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, నాయకులు ఎన్.శ్రీరాములు, కత్తి రవి, బండి చలపతి, వి.ఉదయ్ కుమార్, రవి, రాజా, గోవిందస్వామి, డా.ఆర్.బలరాం, జింకా నాగరాజు, వైయస్ మణి, అల్లాబక్షా, బాల సుబ్రమణ్యం, ఓం రాజ్, రవి, శ్రీనివాసులు తదితరులు నివాళులర్పించారు.

రైతుల మార్కెట్, డిజిటల్ వృద్ధికి ఫ్లిప్‌కార్ట్ కృషి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సొసైటీ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) సహకారంతో స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్ రైతుల మార్కెట్ డిజిటల్ వృద్ధి కోసం కృషి చేస్తుందని ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పీఓలు)కు అవసరమైన మార్కెట్ పరిజానం, డిజిటల్ సాధనాలు వారి వ్యాపారాలను విస్తరింప చేయడానికి వ్యూహాలతో సన్నద్ధం చేయడంపై దృష్టి సారించిందన్నారు. గ్రామీణ వ్యాపారులకు అవసరమైన సాధనాలు, పరిజ్ఞానం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - నాగలాపురం: శనివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నాగలాపురం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేశారు. నాగలాపురం మండలం, కాళంజేరి, కృష్ణాపురం గ్రామాలు, నాగలాపురం కోటవీది, మిరప తోట, ఎస్ ఎస్ పురం పంచాయతీలోని అడవి కండ్రిక వద్ద నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. కృష్ణాపురంలో నిర్మించే పశువుల నీటి తొట్టెకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాలలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారిని రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్, ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి శక్తికాంత దాస్‌లు దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో వీరు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి శక్తికాంత దాస్ కు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలుకగా నాదెండ్ల మనోహర్ కు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్ళిన వీరు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు..

రాష్ట్ర అభివృద్ధే సీఎం లక్ష్యం

ఎమ్మెల్సీ సోము వీర్రాజు

ప్రజాశక్తి - తిరుమల: 2014 నుంచి 2024 సంవత్సరం వరకు రాష్ట్రం ఇబ్బందులూ పడిందని బీజేపీ రాష్ట్ర ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. శ్రీవారి అనుగ్రహం వల్ల ఇబ్బందులు తొలగి అనేక అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రంలో జరుగుతున్నాయన్నారు. వీఐపీ విరామ దర్శన సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాజధాని, పోలవరం, స్టీల్ ప్లాంట్ వంటివి ప్రగతిని సాధిస్తుందన్నారు. ఈ వయస్సులో కూడా రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నిరంతరం పర్యటన చేస్తున్నారన్నారు.ప్రభుత్వంలో ఉన్న పెద్దల ఆరోగ్యాన్ని కాపాడి,రాష్ట్రం ముందుకు వెళ్ళేలా శ్రీవారిని ప్రార్థించానన్నారు.

ఐటీసీ ఆశీర్వాద్ మసాలాల బ్రాండ్ ప్రచారకర్తగా నాని

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రముఖ ఐటిసి లిమిటెడ్ ఆశీర్వాద్ మసాలాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి తమ బ్రాండ్ అంబాసిడర్‌గా టాలీవుడ్ నేచురల్ స్టార్ నానిని ఎంచుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఈ బ్రాండ్ తన ప్రాంతీయ ప్రచారంలో భాగంగా "దమ్ము మీదే, స్టార్ మీరే" అంటూ కొత్త టెలివిజన్ వాణిజ్య ప్రకటన (టీవీసీ)ను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐటిసి లిమిటెడ్ స్పైసెస్ బిజినెస్ హెడ్ పియూష్ మిశ్రా మాట్లాడుతూ జీవితాతీత ఆకర్షణకు చిరునామాగా నిలిచే నాని, ఆశీర్వాద్ మసాలాల ప్రధాన విలువలైన ఆకర్షణీయమైన, శక్తివంతమైన , అద్భుతమైన రుచి, పూర్తి స్థాయి దమ్ము ను సంపూర్ణంగా ప్రతిబింబిస్తారన్నారు. తన నటనతో ప్రేక్షకులను నాని ఆకర్షించినట్లే, ఆశీర్వాద్ మసాలాలు ప్రతి వంటకాన్ని శక్తివంతమైన రంగు సాటిలేని రుచితో ఉన్నతీకరిస్తాయన్నారు. ఈ భాగస్వామ్యంతో, బ్రాండ్ ఈ ప్రాంతంలోని వినియోగదారులతో తమ అనుబంధాన్ని మరింతగా పెంచుకోవడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తరతరాలుగా తెలుగు వంటకాలు ఆకర్షణీయమైన రుచులు, సుగంధ ద్రవ్యాలు సిగ్నేచర్ 'తెలుగు కారం' తో వృద్ధి చెందాయని, తమ విస్తృత శ్రేణి అధిక–నాణ్యత, ప్రామాణికమైన మసాలాల ద్వారా ఈ పాకశాస్త్ర వారసత్వాన్ని ఆశీర్వాద్ మసాలా గౌరవిస్తుందన్నారు. వినియోగదారులు ఆశీర్వాద మసాలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రామచంద్రపురం : తిరుపతి జిల్లా రామచంద్రపురం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనింగ్ ఐపీఎస్ బొడ్డు హేమంత్ హెచ్చరించారు. శనివారం మండలంలోని కొత్త నేనూరు గ్రామ సమీపంలో ఉన్న నాం కాలువ వద్ద వివిధ ప్రాంతాల నుండి యువకులు భారీగా వచ్చి మద్యం సేవించి, కాలువలో ఈత కొడుతున్న వారికి పోలీసులు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. నాంకాలువలో ఈత కొట్టేందుకు తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి, వడమాల పేట ప్రాంతాల నుంచి యువకులు ద్విచక్ర వాహనాలలో వచ్చి మద్యం సేవించి, ఈత గొట్టి అల్లర్లు చేసేవారిని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో (మార్చి 29వ తారీఖున) గత శనివారం నడలూరు పర్యటనకు ఎమ్మెల్యే పులివర్తి నానికి మహిళలు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే పులివర్తి నాని నాంకాలవ వద్ద పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించడంతో పోలీసులు పర్యటించి, యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కౌన్సిలింగ్ కార్యక్రమంలో ఎస్సై రవీంద్ర నాయక్, హెడ్ కానిస్టేబుల్ మహేష్, రమేష్, సురేష్, యోబు, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎడిఫై' లో కెరీర్ పై అవగాహన సదస్సు

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అడుగు పెడుతున్న విద్యార్థులకు కౌటిల్య ఇన్స్టిట్యూషన్ కంపెనీ వాచిచే కెరీర్ అవేర్ నెస్, లైఫ్ స్కిల్స్ పై సెమినార్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని ఎడిఫై విద్య సంస్థ 'సంస్కృతి జూనియర్ కాలేజీ లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అడుగు పెడుతున్న విద్యార్థులకు కౌటిల్య ఇన్స్టిట్యూషన్' కంపెనీ చే 'కెరీర్ అవేర్ నెస్ మరియు లైఫ్ స్కిల్స్' పై సెమినార్ నిర్వహించారు. దీనిలో కౌటిల్య డైరెక్టర్– శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి వక్తలుగా ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్– పి.ప్రణీత్, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.దేవరాజులు, ఫ్యాకల్టీ శరత్ తదితరులు పాల్గొన్నారు. ప్రణీత్ మాట్లాడుతూ విద్యార్థి దశలో 'జిజ్ఞాస' అనే గొప్ప లక్షణం చదువులో అనేక కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఉత్సాహాన్ని నింపుతుంది. కాబట్టి మీరు ఈ కుతూహలము, జిజ్ఞాసపై దృష్టి పెట్టండి అన్నారు. గొప్ప సైంటిస్టులు అందరూ ఈ లక్షణాలు ఉండబట్టే అనేక పరిశోధన చేయగలిగారు తద్వారా మనమంతా లాభపడుతున్నామన్నారు. విద్యార్థులు తమ చదువులు తమ స్వలాభం కోసమే కాకుండా సమాజానికి సహాయం చెయ్యాలనే దృక్పథం తో ముందుకు సాగాలి. విద్యార్థులు తమ పేరెంట్స్ మరియు టీచర్స్ తో సత్సంబంధాలు కలిగి ఉండాలి. మీరు ఎంత గొప్పగా ఎదిగిన 'వినయం మరి కృతజ్ఞత' మీ జీవితం లో విజయాలకు చాలా కీలక పాత్ర పోషిస్తుంది. అలానే , మీరు చేపట్టబోయే కెరియర్ పై స్పష్టత ఏర్పరచుకోండి. ఫలానా లక్ష్యాన్ని చేపడితే వైఫల్యం చెందుతామనే భయాన్ని విడనాడండి. ప్రతి గొప్ప ప్రయాణం ఒక అడుగుతోనే మొదలవుతుంది అనే విషయాన్ని మరిచిపోవద్దండి అని చెప్పారు. కౌటిల్య కంపెనీ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు అత్యున్నత శక్తి సామర్థ్యాలు ఉంటాయి. చాలా మంది విద్యార్థులు వీటిని ఉపయోగించుకోకుండా పోవడం ద్వారా తమ జీవితంలో అనుకొన్న లక్ష్యాన్ని చేరుకోలేరన్నారు. కాబట్టి, మీరు సానుకూల దృక్పథంతో ఎటువంటి లక్ష్యాన్ని అయినా ఛేదించవచ్చు అన్నారు. ముఖ్యంగా చిన్న చిన్న కష్టాలకు బెదరద్దు. సునీత విలియమ్స్ గురించి ఒక్కసారి ఆలోచించండి 9 నెలలు అంతరిక్షంలో అనుకోకుండా చిక్కిపోయి ఆహారం లేకపోయినా, తన ఆరోగ్యాన్ని, జీవితాన్ని ప్రణంగా పెట్టి 'కేవలం మానవాళికి మేలు చేయాలి' అని ఒకే ఒక్క ధ్యేయంతో అంతరిక్ష పరిశోధన చెయ్యడం మనమందరూ చూసామన్నారు. మీకందరికీ తెలుసు అబ్దుల్ కలాం 8 సంవత్సరాల వయసులోనే న్యూస్ పేపర్ వేసుకుంటూ తన చదువును కొనసాగించాడు. కాబట్టి ఇలాంటి గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చూస్తే మనకు చాలా ప్రేరణ కలుగుతుంది. అనేకమంది గొప్ప వ్యక్తులు తమ బాల్యంలో ఎన్నో కష్టాలు పడితేనే వారు ఈ స్థాయికి వచ్చారు. అయితే, నేటి తల్లితండ్రులు తాము కష్టపడుతూ, మీకు లేదా పిల్లలకు కష్టం రానీయకుండా పెంచుతున్నారు. అప్పుడు మీరు మీ పేరెంట్స్ కు ఇవ్వాల్సిన రిటర్న్ గిఫ్ట్ ఏంటంటే– మీరు జీవితంలో గొప్ప స్థాయికి రావడంతో పాటు దేశంలో మంచి పౌరుడుగా ఉండటం కూడా. ఎన్.ఎస్.రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ పూర్తి అయిన తర్వాత, విద్యార్థులకు ఇంజనీరింగ్ కాకపోతే, అనేక సెంట్రల్ గవర్నమెంట్ విద్యాసంస్థలలో డిగ్రీ చెయ్యవచు. – క్లాట్ ద్వారా నేషనల్ లా యూనివర్సిటీలలో న్యాయ విద్యలో డిగ్రీ, ఐ.పి.మ్యాట్ ద్వారా ఐ.ఐ.ఎం లలో బి.బి.ఏ సి.యూ.ఈ.టి ద్వారా, అన్ని సెంట్రల్ యూనివర్సిటీస్ లో డిగ్రీ అడ్మిషన్ పొందవచ్చు. అలానే, మన తిరుపతిలోని కేంద్ర విద్య సంస్థ – ఐసెర్ లో కూడా ప్రత్యేక ప్రవేశ పరీక్ష ద్వారా డిగ్రీ చెయ్యవచు. కాబట్టి, ఇంటర్ విద్యార్థులు ఐ.ఐ.టి పరీక్షలో విఫలమైతే, నిరాశ చెందకుండా, కేంద్ర విద్యాసంస్థ ఆధర్వంలోని అనేక ప్రముఖ డిగ్రీలు వున్నాయి అనే విషయాన్నీ పిల్లలు మరియు పేరెంట్స్ గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చంద్రగిరి శ్రీ కోదండరామ స్వామి వారి

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరి గ్రామంలోని శ్రీ కోదండరామస్వామివారి బ్రహోత్సవాలకు శనివారం సాయంత్రం 6 నుండి 7.30 గంటల వరకు శాస్త్రక్తంగా అంకురార్పణ నిర్వహించారు.

నేడు కోదండ రాముని బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం

ఈరోజు ఉదయం 8 నుండి 9 గంటల మధ్య ధ్వజారోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 6.30 నుండి 7.30 గంటల వరకు శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారు, ధ్వజపటము, చక్రతాళ్వారులకు తిరువీధి ఉత్సవం జరుగనుంది. అనంతరం శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామివారి సమక్షంలో ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఏప్రిల్ 10వ తేదీ సాయంత్రం 6 నుండి రాత్రి 7.30 గంటల వరకు హనుమంత వాహనంపై స్వామివారు విహరించి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఏప్రిల్ 11వ తేదీ ఉదయం 9 నుండి 10 గంటల వరకు శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

ఏప్రిల్ 12వ తేదీ ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం 6 నుండి రాత్రి 7.30 గంటల వరకు గరుడ వాహనంపై స్వామివారు ఉరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. రూ.750/– చెల్లించి గృహస్తులు (ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. ఏప్రిల్ 14వ తేదీ ఉదయం 9 నుండి 10 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు, చక్రత్తాళ్వార్‌కు వసంతోత్సవం నిర్వహించనున్నారు. తరువాత ఉదయం 10 నుండి 10.30 గంటల వరకు చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ధ్వజావరోహణముతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఏప్రిల్ 15వ తేదీ ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు ఊంజల సేవ జరుగనుంది. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హరికథలు, భజనలు, సంగీత కచేరీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శనివారం ఎన్నికల అధికారులు చెంగల్రాయులు, చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని 2025–2028 కాలానికి ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా గుణశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుప్పయ్య, కోశాధికారిగా రామలింగం, గౌరవ అధ్యక్షులుగా యుగంధర్ రాజు, ఉపాధ్యక్షులుగా బాలసుబ్రమణ్యం, హనుమంతరావు, లోకేశ్వరి, మాలిని దేవి, కార్యదర్శులుగా రామచంద్ర రాజు, టి.వి.రమేష్, అరుణాచలం రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకటరమణయ్య, 16 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవకంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులచే రాష్ట్ర బాధ్యులు జయరాం నాయుడు, జిల్లా అధ్యక్షులు శంకర్‌లు ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా సత్యవేడు సంఘ బాధ్యులు బలరాం హాజరయ్యారు.

కాటయ్య మృతికి నివాళి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నారాయణ మండలం, అంగన్వాడి టీచర్ సరళ భర్త కాటయ్య మృతి చెందారు. విషయం తెలుసుకుని పాలమంగలం దళిత వాడలో ఆయన సగృహానికి చేరుకొని సిఐటియు తిరుపతి జిల్లా సభ్యులు నాగలాపురం నాగరాజు నివాళులర్పించారు. అనంతరం కాటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నారాయణ మండలం సిఐటియు కార్యదర్శి ముని శంకర్, మునీంద్ర ఉన్నారు.

అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: జిల్లా వైద్యఅధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆదేశాల మేరకు పిహెచ్‌సి వైద్యాధికారి విద్యాసాగర్ హెల్త్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వడదెబ్బ ఇతర ఆరోగ్య విషయాలపై బుచ్చినాయుడు కండ్రిగ పిహెచ్‌సీ, పరిధిలోని ప్రైవేటు, ప్రభుత్వ వసతి గృహాలలో అవగాహన కల్పించారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసరమైతేనా బయటకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆరోగ్య సిబ్బంది, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు, బాలాజీ నగర్లో ఉన్న ప్రగతి కార్యాలయంలో శనివారం చెన్నూరుకు చెందిన నిరుపేద మహిళలకు పామూరు రామ్మోహన్ జ్ఞాపకార్థం ఆయన భార్య లక్ష్మి, కుమారులు నరేంద్ర, శ్రీనివాస్ తేజ, కోడలు సంధ్య దీప్తి, వారి కుటుంబ సభ్యుల సహకారంతో చెన్నూరుకు చెందిన సుప్రియ అనే మహిళకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో కుట్టుమిషన్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులైన మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ సేవా దృక్పథాన్ని పెంపొందించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు వాచ్ షాప్ రాము, పోతిరెడ్డి పెంచలయ్య, కృష్ణారెడ్డి, సంచి ముని ప్రసాద్, వెంకటేశ్వర్లు, నారాయణ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నటుడు సుమన్‌ను కలిసిన డాక్టర్ నారాయణ గౌడ్

ప్రజాశక్తి - క్యాంపస్ :ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ హైదరాబాద్‌లో షూటింగ్‌లో సినీ నటుడు సుమన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ మాట్లాడుతూ అనేక పౌరాణిక పాత్రల్లో నటిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న నటుడు సుమన్ హైదరాబాదులో షఉటింగ్లో కలవడం ఆనందదాయకమన్నారు. ఆయన భవిష్యత్తులో మరెన్నో పౌరాణిక పాత్రల్లో నటించాలని స్వామిని కోరుకున్నారు.

స్విమ్స్‌లో సి.ఎం.ఇ విజయవంతం

ప్రజాశక్తి - తిరుపతి : స్విమ్స్ ఇమ్యూనో హిమటోలజీ, బ్లడ్ ట్రాన్స్ ఫ్యూజన్, ఎమర్జెన్సీ మెడిసిన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం (సి.ఎం.ఇ)ను నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ విభాగాధిపతి డా. శ్రీధర్ బాబు, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డా. క్రిష్ణసింహ రెడ్డి, బ్లడ్ బ్యాంక్ విభాగం, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగపు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానికి ధన్యవాదాలు

ప్రజాశక్తి - తిరుమల: వక్ఫ్ చట్టం అమలు చేసేందుకు భారత ప్రధాని మోదీకి సహకరించిన రాజకీయ పార్టీ, నాయకులకు తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు కృతజ్ఞతలు తెలిపారు. వీఐపీ విరామ దర్శన సమయంలో రఘునందన్ రావు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారి సేవలో పాల్గొన్న ఆయనకు టీటీడీ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.